సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకం 7వ పే.
పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి 7వ పే.



'ఆసరా' అక్రమాలు

- ఆధార్ లింక్‌తో అనర్హులకు చెక్
- జిల్లాలో డబుల్ పింఛన్లు
- ఉద్యోగ పింఛన్‌తో పాటు ఆసరా పింఛన్లు
- జిల్లాలో రూ. 63 లక్షల రికవరీకి సిద్ధం
- జిల్లాలో 71 మంది గుర్తింపు... తాత్కాలికంగా నిలిపివేసిన నోటీసులు
- గతంలో ఇంటింటి సర్వేలో భారీగా బయటపడ్డ పింఛన్ల గోల్‌మాల్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

నిరుపేద కుటుంబాలకు జీవనం సాగించే క్రమంలో కాస్తా చేయూతగా నిలవాలని, దశాబ్దాల కాలంగా ప్రభుత్వాలు పింఛన్లు అందిస్తోంది. గతంలో కొద్ది మొత్తంలోనే పింఛన్ అందించేవారు. గత ప్రభుత్వ హయాం నుంచి పింఛన్ డబ్బులు పెరగడంతో పింఛన్ పొందడానికి డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం ఆసరా పేరుతో వయో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, బీడీ టేకేదార్లు, గీతా కార్మికులు, చేనేత కార్మికులు, వితంతువులు, హెచ్ఐవీ, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ వ్యాధిగ్రస్థులకు ఇలా 11 రకాలుగా ప్రభుత్వం చేయూత పథకం కింద పింఛన్లను అందిస్తోంది. సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డు ప్రామాణికంగా ఉన్నా ఆసరా పథకానికి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడం ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆసరా పింఛన్లు రెండు రకాలుగా అందుకుంటున్న వారు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు పదవీవిరమణ పొందిన తరువాత పెన్షన్‌తో పాటు ఆసరా పెన్షన్లు కూడా పొందుతున్న వారు ఉన్నారు. ఈ క్రమంలోనే 2018 వరకు రేషన్ కార్డు అర్హత ఉండగా తరువాత దశల వారీగా ఆధార్ లింక్ చేయడంతో రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఆసరా పింఛన్లలో దాగిన అక్రమాలు బయటపడుతున్నాయి. జిల్లాలో తాజాగా 71 మంది డబుల్ పింఛన్లు, ఉద్యోగ విరమణ తరువాత రెండు పింఛన్లు పొందుతున్న వివరాలు బయటపడ్డాయి.

● జిల్లాలో రూ. 63 లక్షల రికవరీకి సిద్ధం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆధార్ లింక్‌తో భర్త ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగానే భార్యకు పింఛన్ పొందడం, భర్త మరణించిన తర్వాత భర్తకు సంబంధించిన పింఛన్‌తో పాటు ఆసరా పెన్షన్, ప్రభుత్వ ఉద్యోగంలో కుటుంబ సభ్యులు ఉన్నా ఇంట్లో తల్లిదండ్రులు పెన్షన్ పొందడం వంటివి వెలుగు చూశాయి. ఆధార్ లింక్ ద్వారా అక్రమ పింఛన్‌లు రాష్ట్ర స్థాయిలో వెలికితీసి జిల్లాకు పంపించారు. జిల్లాలో 71 మంది నుంచి రూ. 63 లక్షల 10 వేల 136 పింఛన్ డబ్బులను రికవరీ చేసే దిశగా నోటీసులు సిద్ధం చేశారు. కొందరికి నోటీసులు కూడా జారీ చేసిన క్రమంలో నోటీసుల ప్రక్రియ నిలిపివేస్తూ సీఎస్ శాంతికుమారి అధికారులకు సూచనలు చేయడంతో నిలిచిపోయింది. రికవరీ కేవలం ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చే వరకు మాత్రమే ఉంటుందని తెలిసింది. అసెంబ్లీ సమావేశాల్లో అక్రమ పింఛన్లపై నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతంలో కూడా ఆసరా పింఛన్లలో అనేక అక్రమాలు బయటపడ్డాయి. ప్రధానంగా బీడీ కార్మికుల పింఛన్లలో అవకతవకలు వెలుగు చూశాయి. సిరిసిల్ల మున్సిపాలిటీల్లోనే 200 మంది ఖాతాల్లో అక్రమంగా డబ్బులు పడుతున్న విషయాన్ని గుర్తించారు. కొందరికి బీడీ పింఛన్ వస్తున్నట్లు ప్రొసీడింగ్‌లు ఉన్నా డబ్బులు రానీ పరిస్థితి ఉంటే ప్రొసీడింగ్‌లు లేకుండానే వేరే వారి ఖాతాల్లో డబ్బులు జమ అయిన సందర్భాలు ఉన్నాయి. వివిధ మండలాల్లో బీడీ కార్మిక పింఛన్, ఇంటింటి సర్వేతో అక్రమాలు వెలుగు చూశాయి. పింఛన్ డబ్బులను మళ్లీ రికవరీ చేశారు.

● జిల్లాలో 1.19 లక్షల పెన్షన్లు...

జిల్లాలో లక్షా 19 వేల 602 ఆసరా పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. వృద్ధాప్య పింఛన్లు 32,753 మంది, దివ్యాంగులు 9,943 మంది, వితంతువులు 24,298 మంది, చేనేత కార్మికులు 3,639 మంది, గీతా కార్మికులు 2,306 మంది, ఒంటరి మహిళలు 1,823 మంది, బీడీకార్మికులు 43,328 మంది, ఫైలేరియా బాధితులు 975 మంది, డయాలసిస్ వ్యాధిగ్రస్థులు 66 మంది, బీడి టేకేదార్లు 471 మంది ఉన్నారు. జిల్లాలో మండలాల వారీగా పింఛన్ దారుల్లో బోయినపల్లి 6,908 మంది, చందుర్తి 7,119 మంది, ఇల్లంతకుంటలో 8,464 మంది, గంభీరావుపేటలో 11,554 మంది, కోనరావుపేటలో 9,404 మంది, ముస్తాబాద్‌లో 10,762 మంది, రుద్రంగిలో 2,925 మంది, సిరిసిల్ల మున్సిపాలిటీల్లో 21,988 మంది, తంగళ్లపల్లిలో 10,781 మంది, వీర్నపల్లిలో 2,149 మంది, వేములవాడలో 3,395 మంది, వేములవాడ రూరల్‌లో 5,520 మంది, వేములవాడ మున్సిపాలిటీలో 7,306 మంది, ఎల్లారెడ్డిపేట లో 11,327 మంది ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ 26 కోట్ల 21 లక్షల 10 వేల 560 పింఛన్‌ను అందిస్తున్నారు.

రైతు మోములో ఆనందం



నిజామాబాద్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్

- జిల్లాలో రుణమాఫీపై సంబురాలు
- ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రభుత్వ విప్, కలెక్టర్, అధికారులు



ఒగ్గుడోలు కొడుతూ సంబరాల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లలో బైక్ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

సిరిసిల్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రైతులు, కాంగ్రెస్ నాయకులు గురువారం సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రైతులకు రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వగా తొలి విడతలో లక్ష రూపాయల వరకు రుణమాఫీ అయిన సందర్భంగా ర్యాలీలు, క్షీరాభిషేకాలు, సంబురాలు జరుపుకున్నారు.

జిల్లాలోని మారుపాక, చందుర్తి, కొదరుపాక, నిజామాబాద్, హన్మజిపేట, తాడూర్, బందనకల్, చంద్రంపేట, బొప్పాపూర్, ఇల్లంతకుంట, వీర్నపల్లి, రుద్రంగి రైతు వేదికల్లో రైతులు, అధికారులు, ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ రైతు వేదికలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ర్యాలీలు, ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. జిల్లాలో 23 వేల 986 మంది రైతులకు తొలి విడతలో రుణమాఫీ జరిగింది. గ్రామ పంచాయతీల వద్ద రుణమాఫీ వివరాల జాబితాలను వెల్లడించారు. రైతులు ఎంతో సంబురంగా రుణమాఫీపై చర్చించుకున్నారు.

మరమ్మతు పనులు ప్రారంభం

సిరిసిల్ల రూరల్, జూలై 18: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామంలోని మహిళ సంఘ భవన మరమ్మతు పనులకు వార్డు కౌన్సిలర్ చెన్నమనేని కీర్తికమలాకర్‌రావు గురువారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. మహిళ సంఘం భవనం అసంపూర్తిగా ఉండడంతో దాని పూర్తి నిర్మాణానికి కరీంనగర్ ఎంపీ నిధుల నుంచి డబ్బులు మాంజూరు కావడంతో మరమ్మతు పనులను ప్రారంభించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నమనేని కమలాకర్‌రావు, మాజీ సర్పంచ్ ర్యాకం రమేష్, వార్డు అధ్యక్షుడు మంగ ప్రశాంత్, గుగ్గిళ్ల తిరుపతిగౌడ్, కాసారం నర్సయ్య, కాసారం ఎల్లయ్య, మహిళ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన అఖండ భజన

చందుర్తి, జూలై 18: చందుర్తి మండల కేంద్రంలోని మహాలక్ష్మి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం ప్రారంభించిన 24 గంటల అఖండ భజన కార్యక్రమం గురువారం ఉదయం ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ఉదయం ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ బాశెట్టి భాస్కర్, నాయకులు గొట్టె ప్రభాకర్, చిలుముల గోపాల స్వామి, పులి సత్తయ్య, బాశెట్టి మౌళయ్య, చిలుక త్రిభువన్, నాగుల శంకర్, రాజూరి రాజయ్య, రాజూరి సద్గుణచారి, బుర్ర రాజారాం తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీరైతుకు రుణమాఫీ అందేలా చూడాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- రుణమాఫీపై బ్యాంకర్లు, అధికారులతో సమీక్ష

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 18: జిల్లాలో అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అందేలా చూడాలని బ్యాంకర్లను, అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో రుణమాఫీపై గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బ్యాంకుల వారీగా, వ్యవసాయ సహకార సంఘాల వారీగా జిల్లాలో ఉన్న రైతు రుణాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మొదటి విడత కింద మన జిల్లాలో లక్ష రూపాయలలోపు రుణం తీసుకున్న 23వేల 986 మంది రైతులకు రుణాల సొమ్మును ప్రభుత్వం గురువారం జమ చేస్తుందని సంబంధిత రైతులకు రైతు రుణమాఫీ సొమ్ము చేరేలా బ్యాంకులు, వ్యవసాయాధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మొదటి దశలో జరుగుతున్న రుణమాఫీ లబ్ధిదారుల జాబితాతో లీడ్‌బ్యాంకు మేనేజర్ బ్యాంకుల వారీగా రీకనెక్షన్ చేయాలన్నారు. లీడ్‌బ్యాంక్ మేనేజర్‌కు పూర్తి స్థాయిలో బ్యాంకులు సమాచారం అందజేయాలని కోరారు. ప్రతీ మండల కేంద్రంలో బ్యాంకర్లు వ్యవసాయాధికారులు గ్రీవెన్స్ సెల్‌లను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. వ్యవసాయ సహకార సంఘాల బ్యాంకుల ద్వారా రైతులు చేసిన రుణాలను సైతం ప్రభుత్వం మాఫీ చేస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ సొమ్ము వినియోగంపై ప్రతీరోజు నివేదికలను అందజేయాలన్నారు. వ్యవసాయ శాఖ తరుపున సీనియర్ అధికారిని జిల్లాలో రుణమాఫీ గురించి వివరాల సేకరణ కోసం కేటాయించి ప్రభుత్వం విడుదల చేసిన సొమ్ము సాఫీగా రైతులకు చేరేలా చూడాలన్నారు. ప్రతీ మండల కేంద్రంలో బ్యాంకర్లు వ్యవసాయాధికారులతో గ్రీవెన్స్ సెల్‌లను ఏర్పాటు చేసి రుణమాఫీకి సంబంధించి వచ్చే ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కారించాలని ఆదేశించారు. సమావేశంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, యుబీఐ ఏజీఎం సురేష్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామచంద్రుడు, కేడీసీసీ డీజీఎం రోహిణి, టీజీఎం అర్‌వో రవి తదితరులు పాల్గొన్నారు.



అధికారుల, బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

మత్తుపదార్థాల నియంత్రణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

- వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ టౌన్, జూలై 18: గంజాయి, మత్తుపదార్థాలను తరమికొట్టాలంటే విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి సూచించారు. మండలంలోని అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి స్థానిక ఫంక్షన్‌హాల్‌లో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసకాకుండా మంచిగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. యువత, విద్యార్థులు గంజాయి, మత్తుపదార్థాలను తరిమి కొట్టడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చా రు. డ్రగ్స్, మత్తుపదార్థాలు, గంజాయి గురించి సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ 8712656392 లేదా డయల్ 100 సమాచారం అందించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ పని చేస్తోందని, అందులో భాగంగా జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో యాంటీ డ్రగ్ క్లబ్ ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని పాఠశాలలో, కళాశాలలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలు, విద్యార్థినులు వేధింపుల నుంచి బయటపడేందుకు ధైర్యంగా ముందుకు వెళ్లడమే సరైన మార్గమన్నారు. విద్యార్థినులు పోకిరిల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వేధింపులకు లోనైతే వెంటనే ఇంట్లో తల్లిదండ్రులకు లేదా టీచర్లకు తెలియజేయాలని సూచించారు. జిల్లాలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన షీ టీమ్ విద్యాసంస్థలు, బస్టాండులు, మహిళలు పని చేసే ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో నిరంతరంగా పోకిరీలపై నిఘా ఉంచాలన్నారు. ఎవరైన వేధిస్తే డయల్ 100 లేదా జిల్లా షీ టీమ్ నంబర్ 8712656425కు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో నార్కోటిక్ డీఎస్పీ ఉపేందర్, సీఐ వీరప్రసాద్, ప్రిన్సిపాల్ రాజగోపాల్, అంజయ్య, షీటీమ్ ఎస్సై ప్రమీల తదితరులు ఉన్నారు.

ఎస్ఐని కలిసిన నాయకులు

వీర్నపల్లి, జూలై 18 : వీర్నపల్లి మండల ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎల్లాగౌడ్‌ను మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. మారుమూల ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు మాలోతు లక్పతి నాయక్, పిట్ల నాగరాజు, మడుపు తిరుపతిరెడ్డి, సంతోష్ గౌడ్, శ్రీనివాస్, లింబాద్రి, తదితరులు ఉన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

ఇల్లంతకుంట, జూలై 18: మండలంలోని పెద్దలింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీలో కంకనాల శ్రీనివాస్, తూముకుంట రాంలింగారెడ్డి, శ్రీనివాస్ ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జితేందర్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు గుర్రం సందీప్‌రెడ్డి, నాయకులు గన్నారం నర్సయ్య, పసుల వెంకటిలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీ హోటల్ యూనియన్ కార్యవర్గం

గంభీరావుపేట, జూలై 18: గంభీరావుపేట టీ హోటల్ యూనియన్ నూతన కార్యవర్గం గురువారం ఎన్నికైంది. అధ్యక్షులుగా కొట్టె వెంకటేశం, ఉపాధ్యక్షులుగా చెరిపెల్లి సతీష్, కార్యదర్శిగా గడ్డమీది కిషన్ సభ్యులుగా నాగరాజు, అరవింద్, కిరణ్‌సింగ్, అంజనేయులు, జోష్, ఎండీ ఖస్మీయా తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేల కొనుగోలు మీద ఉన్న శ్రద్ధ ప్రజల మీద లేదు

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

వేములవాడ టౌన్, జూలై 18: సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల కొనుగోలు మీద ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపైన లేదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా పదాధికారుల సమావేశం పట్టణంలోని భీమేశ్వర గార్డెన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ప్రజా పాలన గాలికి వదిలేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల మీద కంటే ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చేందుకే సమయాన్ని ఎక్కువ గడుపుతున్నాడని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడికక్కడ క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేసి అత్యధిక స్థానాలు గెలుపొందేలా ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల బలోపేతంతోనే పార్టీ బలపడడమే కాకుండా వచ్చే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటవచ్చునని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, నాయకులు అల్లాడి రమేశ్, కోలా కృష్ణస్వామి, మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, రేగుల మల్లికార్జున్, రెడ్డబోయిన గోపి తదితరులు ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు



జాటోతు హుస్సేన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రతాప రామకృష్ణ, అర్చకులు

వేములవాడ కల్చరల్, జూలై 18: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఆలయ ఏఈవో వినోద్‌రెడ్డి ప్రోటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఈవో రాజన్న ప్రసాదం అందజేశారు.

అనంతరం ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ ఎప్పుడో తను ఎనిమిదవ తరగతిలో వున్నప్పుడు రాజన్న ఆలయానికి వచ్చానని, అప్పటికి ఇప్పటికి అభివృద్ధి అనుకున్నంత అభివృద్ధి జరగలేదన్నారు. రాజన్న ఆలయాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ మహేష్, టౌన్ సీఐ వీరప్రసాద్, సూపరింటెండెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, నటరాజు, ఎడ్ల శివసాయి తదితరులు ఉన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, జూలై 18: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన నాగపూరి సంతోష్ అనే గీత కార్మికుడు గురువారం తాటిచెట్టుపై నుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. రోజు వారి పనిలో భాగంగా సంతోష్ కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు జమ్మి కుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సంతోష్‌గౌడ్‌కి భుజం విరిగి నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడిని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

జీఎస్టీ అధికారుల అవగాహన

- భయంతో దుకాణాలు బంద్ చేసిన వ్యాపారులు



అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి రజక్, సిబ్బంది

ముస్తాబాద్, జూలై 18: ముస్తాబాద్ మండల కేంద్రంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అధికారులు పలు వ్యాపార వాణిజ్య దుకాణాలకు అవగాహన కల్పించడం కోసం రాగానే గమనించిన వ్యాపారస్తులు దుకాణాలన్నీ బంద్ చేశారు. ముస్తాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా దుకణాల మూసివేతతో బంద్‌ను తలపించింది. జిల్లా కమర్షియల్ ట్యాక్స్ అధికారి రజక్ తన బృందంతో జీఎస్టీపై అవగాహన కల్పించేందుకు ముస్తాబాద్‌కు గురువారం వచ్చారు. జీఎస్టీ వలన కలిగే ఉపయోగాలను, ఉచితంగా జీఎస్టీ నమోదు చేయడం వంటి వివరాలను తెలియజేయడానికి జీఎస్టీ నమోదు లేని దుకాణ యజమానులకు వివరించేందుకు వచ్చామని, నమోదుతో ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు.

గొలుసుకట్టు మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, జూలై 18: జిల్లాలో గొలుసుకట్టు (చైన్)మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని పోలీసుశాఖ ప్రకటించింది. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సైబర్ సెల్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఏదైనా కంపెనీ పేరుతో ముందుగా మీరు కొంత డబ్బులు కట్టి జాయిన్ అవ్వండని, ఆ తర్వాత అందులో మరో ముగ్గురిని జాయిన్ చేస్తే లైఫ్ లాంగ్ ఆదాయం ఉంటుందని చెప్పి మోసం చేస్తారని సైబర్‌సెల్ పేర్కొంది. ఏలి అండ్ లిల్లి యాప్, వేక్ యాప్, వియాక యాప్, గ్రోమో యాప్, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ ట్రేడింగ్ అండ్ ఆన్‌లైన్ మల్టీలెవల్ మార్కెటింగ్ కంపెనీలో అత్యాశకు పోయి డబ్బులు పెట్టి మోసపోవద్దని వెల్లడించింది. సైబర్ నేరగాళ్లు వాట్సాప్ లేదా టెలిగ్రామ్ ద్వారా ఏ యాప్‌నైనా డౌన్‌లోడ్ చేసుకోమని చెప్తే చేసుకోవద్దని, వెబ్ సైట్‌ను నమ్మవద్దని, ఇదంతా మోసం అని గ్రహించాలని పేర్కొంది. సోషల్ మీడియాలో మోసపూరిత ప్రకటనలు చూసి సొమ్మును అనాలోచితంగా అత్యాశకు పోయి గుర్తు తెలియని యాప్‌లో పెట్టి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసుకోవద్దని, జాగ్రత్తగా ఉండాలని సైబర్ సెల్ వారు ఒక ప్రకటనలో తెలిపారు.

గంజాయి విక్రయిస్తే సమాచారం ఇవ్వాలి

సిరిసిల్ల క్రైం, జూలై 18: మీ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారా... అయితే వెంటనే 8712656392 కు సమాచారం ఇవ్వండని పోలీసుశాఖ విస్తృత ప్రచారం చేపట్టింది. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఇందుకు సంబంధించిన లోగోను విడుదల చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఎవరైనా మత్తుపదార్థాలను (గంజాయి) అమ్మినా, తాగినా, సాగుచేసినా వారి గురించి ఎవరైనా సమాచారం తెలిస్తే ఫోన్ ద్వారా లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసు శాఖ పేర్కొంది. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని ప్రకటించింది.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. గురువారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గే ట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,694 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రా జెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 14.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 24.795 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 447 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 8.777 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.938 టీఎంసీల నీటిని అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

రెండు బైక్‌లు చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 18: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని అల్వాల రాజు, మొడుసు గౌరయ్యలకు చెందిన రెండు ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చోరీ చేశారని బాధితులు తెలిపారు. గ్రామంలోని రాజు, గౌరయ్యలు తమ బైక్‌లను బుధవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి ఉంచారు. గురువారం ఉదయం చూసే సరికి వాహనాలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు రాజు, గౌరయ్య తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కుక్క దాడిలో మున్సిపల్ సిబ్బందికి గాయాలు


కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన భాగ్య

హుజూరాబాద్, జూలై 18: హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో రెండు రోజులుగా పిచ్చికుక్క స్వైర విహారం చేసి సుమారు 40మందిని దాడి చేసి, గాయపరిచింది. గురువారం హుజూరాబాద్ పట్టణంలో మున్సిపల్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పిచ్చికుక్క మున్సిపల్ సిబ్బందిపై విరుచుకు పడింది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో ఇన్‌చార్జీ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కిషన్ రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, రమేశ్ పిచ్చి కుక్క కనబడగా పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా కుక్క ఆరెల్లి రమేశ్‌ను గాయపరిచింది. అతడిని చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్రమత్తమైన మున్సిపల్ సిబ్బంది డాగ్ స్కాచ్‌ను పిలిపించి కుక్కను హతమార్చరు. కాగా గాంధీనగర్ నుంచి విధులకు వస్తున్న భాగ్యను కూడా తీవ్రంగా గాయపర్చగా వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ వీధి కుక్కల బారిన ప్రజలు పడకుండా ఉండేందుకు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బాలుడిపై శునకం దాడి

ఓదెల, జూలై 18 : మండలంలోని గూడెంలో గురువారం కొమ్ము మోక్షిత్ అనే బాలుడిపై శునకం దాడి చేసింది. జమ్మికుంటకు చెందిన మోక్షిత్ ఇటీవల తన అమ్మమ్మ గ్రామమైన గూడెంకు రాగా, దారి వెంట వెళ్తున్న క్రమంలో కుక్కలు దాడి చేయడంతో చెంపకు రెండు చోట్ల గాయాలయ్యాయి. అక్కడున్న వారు మోక్షిత్‌ను రక్షించారు. దీంతో కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, జూలై 18: మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన గాజుల పర్శరాములు (43) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పర్శరాములు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపం చెంది జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు కొంత దూరంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పర్శరాములు భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

రూ. కోటి అప్పు చేసి పరారీ..బాధితుల ఆందోళన


వ్యాపారి ఇంటి ఎదుట గుమికూడిన బాధితులు

మెట్‌పల్లి రూరల్, జూలై 18: ఎక్స్‌కావేటర్ యజమాని సుమారు కోటికి పైగా అప్పు చేసి పరారైన సంఘటన మెట్‌పల్లి మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..జగ్గసాగర్ గ్రామానికి చెందిన పెంట మహిపాల్ తనకున్న ఎక్స్‌కావేటర్ కిరాయికి నడుపుతూ ఉండేవాడు. ఊర్లో అందరితో పరిచయాలు పెంచుకున్నాడు. అత్యవసరం ఉందని కొంత మంది వద్ద వడ్డీకి అప్పులు తీసుకున్నాడు. ఉన్న ఊరు వ్యక్తే కదా అనుకుని అప్పు ఇచ్చిన వారు కూడా ఎలాంటి పత్రం లేకుండా గుడ్డిగా నమ్మి అడినంగా ఇచ్చుకుంటు పోయారు. ఇవే కాకుండా తెలిసిన వృద్ధులు దాచుకున్న పింఛన్ డబ్బులతో పొదుపు చేసుకున్న మహిళలు, కూలీ నాలి చేసుకునే వారిని వదల కుండా మహిపాల్ అప్పులు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వమంటే ఏదో సాకు చెప్పుకుంటూ కాలం వెళ్లదీసాడు. సుమారు కోటి రూపాయల వరకు అప్పు చేయడంతో అప్పు ఇచ్చిన వారు డబ్బులు ఇవ్వమని ఒత్తిడి చేశారు. అప్పు తీర్చే దారి లేక కుటుంబ సభ్యులతో కలిసి పారియాడు. గురువారం ఇంటికి బాధితులు వెళ్లి చూసేసరికి ఇంటికి తాళం వేసి ఉండటం, ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ వాపోతున్నారు. గ్రామాల్లో పలువురు వద్ద లక్షల రూపాలయలు అప్పుగా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

యువకుడి బలవన్మరణం


అభిలాష్(ఫైల్)

కమాన్‌పూర్, జూలై 18: మండల కేంద్రంలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాల ప్రకారం.. కమాన్‌పూర్ గ్రామానికి చెందిన రెడ్డి అభిలాష్(20) డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొద్దీ రోజులుగా కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిఖనిలోని ఫైవ్‌ఇంక్లయిన్ కాలనీలో ఉంటు న్నాడు. గురువారం స్వగ్రామంలోని ఇంటికి వచ్చి ఉరేసు కొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి రెడ్డి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కూతురితో ప్రేమను వదులుకోవాలని హత్యాయత్నం

- యువకుడు లేకపోవడంతో తండ్రిపై దాడి
- దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నీలం రవి

మల్యాల, జూలై 18: తన కూతురితో ప్రేమ వ్యవహారం మానుకోవాలని పలుమార్లు హెచ్చరించినా వినకపోవడంతో అమ్మాయి తండ్రితో పాటు బాబాయి యువకుడి ఇంటిపై దాడికి వెళ్లారు. కానీ అక్కడ యువకుడు అందుబాటులో లేకపో వడంతో అతడి తండ్రి పై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరినీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మల్యాల సీఐ నీలం రవి తెలిపిన వివరాల ప్రకారం.. మ్యాడంపల్లికి చెందిన గుర్రం చిన్నమల్లయ్య కొడుకు రాజ్‌కుమార్ ఇదే గ్రామానికి చెందిన బాసవేని గంగాధర్ కూతురు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తన బిడ్డతో ప్రేమ విషయం మరచిపొమ్మని బాసవేని గంగాధర్, అతని తమ్ముడు అంజి పలుమార్లు రాజ్‌కుమార్‌ను హెచ్చరించారు. అయినప్పటికీ ప్రేమ వ్యవహారం కొనసాగుతుం డడంతో రాజ్‌కుమార్‌ను చంపాలని నిర్ణయించుకున్న గంగాధర్, అంజి ఈ నెల 14న రాత్రి రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లారు. ఇంట్లో రాజ్‌కుమార్ లేకపోవడంతో అతని తండ్రి గుర్రం చిన్నమల్లయ్యపై అంజి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పారిపోయారు. దీంతో గుర్రం రాజ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్ కేసు నమోదు చేశారు. గురువారం అంజి, గంగాధర్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ పేర్కొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

- కరీంనగర్‌కు చెందిన వ్యక్తి భూపాల్‌పల్లిలో అరెస్టు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 18: ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తిని, అతనికి సహకరించిన మరో ఇద్దరిని భూపాలపల్లి పోలీసలు కటకటాల్లోకి పంపించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే గురువారం భూపాలపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు చూపి వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన గుర్రం శ్రీనివాస్‌రావు.. భూపాలపల్లి కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో సెక్యూరిటీ గార్డు, స్వీపర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు కాంట్రాక్టు తనకే వస్తుందని నమ్మబలికాడు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు, ఆశావాహుల నుంచి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు వసూలు చేశాడు. కొంత మందికి జాబ్ కల్పించినట్లుగా డ్యూటీలు చేయించి జీతాలు ఇవ్వకుండా తప్పించుకుని తిరిగేసరికి శ్రీనివాసరావుపై కొంత మందికి అనుమానం కలిగింది. ఇతనికి మరో ఇద్దరు సహకారం అందించారు. నిందితులైన ఆముగ్గురిని బుధవారం రాత్రి అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు డబ్బులు తీసుకున్నట్లు అంగీకరించడంతో గురువారం శ్రీనివాసరావు, సుభాష్, అశోక్‌లను రిమాండ్‌కు పంపించారు.

సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకం

- గిరిజన వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్


మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

సిరిసిల్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకమని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లతో కలిసి సమీక్షించారు. జిల్లాకు వచ్చిన హుస్సేన్‌కు కలెక్టర్, ఎస్పీ అధికారులు ఘనంగా స్వాగతించారు. అనంతరం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం కమిషన్ పనిచేస్తోందని చెప్పారు. గిరిజనులకు ఇబ్బందులు కలిగిస్తే ఎంతవారినైనా శిక్షించే అధికారం కమిషన్‌కు ఉందన్నారు. ప్రజాసమస్యలను సంబంధిత అధికారులు గ్రామ స్థాయిలో మండల స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. కమిషన్ ప్రతీ మూడు నెలలకు ఒకసారి క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తుందని అన్నారు. దేశ వ్యాప్తంగా వ్యక్తిగతంగా పర్యటిస్తూ గిరిజనుల జీవితాల్లో పురోగతిని కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల స్థితిగతులపై సమీక్షిస్తూ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కిందిస్థాయిలోనే చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేయాలన్నారు. గిరిజనులు అధికంగా ఉన్న గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, అవసరమైన శిక్షణలు గ్రామీణ యోజన పథకం కింద చేపట్టాలని చెప్పారు. గిరిజనులకు హక్కుగా రావాల్సిన పోడు పట్టా భూములు అర్హత మేరకు పకడ్బందీగా సర్వే నిర్వహించి పంపిణీ చేయాలని తెలిపారు. సమావేశంలో గిరిజన సంక్షేమ అధికారి జనార్దన్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య

సిరిసిల్ల టౌన్, జూలై 18: గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. 2019 నుంచి గ్రామాల అభివృద్ధి పనులకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రొసీడింగ్‌లు ఇవ్వడంతో అప్పటి సర్పంచ్‌లు లక్షల రూపాయలు అప్పులు తీసుకొచ్చి గ్రామాల అభివృద్ధి కోసం ఉపయోగించారని అన్నారు. గ్రామాలు అభివృద్ధి కోసం సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు రాక కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యకు పాల్పడ్డారాని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు సర్పంచ్‌లు బిల్లులు రాక అప్పులకు వడ్డీలు కడుతూ ఆర్థికంగా చితికిపోతున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేయవద్దని వెంటనే గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లును చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సర్పంచ్‌ల బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటుం దని హెచ్చరించారు. సమా వేశంలో తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాలకర్ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంపనూరి మల్లేశంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవుని సుజాతనర్సయ్య, జిల్లా కార్యదర్శి నారాయణ, నియోజకవర్గం అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, వేముల వాడ మండల అధ్యక్షుడు దొంతి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై18: గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం తుది గడువని కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఔత్సాహికులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్ www. tgbcstudy-circle. cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 75 రోజులపాటు నిర్వహించే శిక్షణ ఈనెల 22న మొదలవుతుందని పేర్కొన్నారు. అభ్య ర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్ష లోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు రూ.5000 ఉపకార వేతనం అందజే స్తామన్నారు. ఉచిత శిక్షణ హైదరాబాద్ సైదాబాద్‌లో ని టీజీ బీసీ స్టడీసర్కిల్‌లో, ఖమ్మంలోని టీజీ బీసీ స్టడీసర్కి ల్‌లలో ఇస్తారస్తారు. సమాచారం కోసం 040-24071178 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

ముస్తాబాద్, జూలై 18: సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి మృతదేహం గురువారం ఇంటికి చేరుకోవడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగారు. మండలంలోని వెంకయ్యకుంటకు చెందిన పిట్ల మహేశ్(45) 15 ఏళ్లుగా సౌదీ అరేబియాలో అల్ జమీల్ కంపెనీలో కులీగా పనిచేస్తున్నాడు, ఈనెల 4వతేదీన గుండెపోటు రావడంతో చనిపోయడాని కుటుంబీకులు తెలిపారు. సౌదీ నుంచి మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సుమారు ఐదు లక్షల రూపాయల వరకు అప్పు ఉందని తెలిపారు. తల్లి మల్ల వ్వ, భార్య కావ్య, కుతూరు నేహ, కొడుకు నవనీత్‌లున్నారు. తెలంగాణా ఎన్ఆర్ఐ డిపార్ట్‌మెంట్ ఇన్ చార్జ్ చిట్టి బాబు, జనగామ శ్రీనివాస్ మృతదేహం హైదరాబాద్ నుంచి స్వగ్రామం రావడం కోసం అంబు లెన్స్‌లో ఏర్పాటు చేశారు. మృతుడి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు.

రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారుల తనిఖీలు

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో గురువారం సివిల్ సప్లయి అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయి శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన సివిల్ సప్లయి అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా...లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని మూడు చోట్ల సోదాలు జరిగాయి. వెల్గటూరు మండలం అంబారిపేటలో గల శ్రీరామ ఇండస్ట్రీస్, రాయికల్ మండలం మైతాపూర్‌లో గల శివమణి ఇండస్ట్రీస్, కోరుట్ల మండలం జోగినిపల్లిలో గల ఎస్ఎల్ఎన్ఎస్ పారాబాయిల్డ్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్ మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపా రు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్‌వో జితేందర్ రెడ్డి, డీఎం జితేందర్ ప్రసాద్, కరీంనగర్ డీఎస్‌వో సురేశ్ రెడ్డి, అధికారులు ప్రభాకర్, లక్ష్మారెడ్డి, పుల్లయ్యలతో పలు మండలాల తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, డీఎస్‌వోలు, డీఎంలు విస్తృతంగా సోదాలు నిర్వహించడం రైస్ మిల్లు వ్యాపార వర్గాల్లో కలకలం రేపింది.


శ్రీరామ ఇండస్ట్రీస్‌లో తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయి అధికారులు

అరెస్టు నుంచి తప్పించుకోవడానికి యువకుడి ఆత్మహత్యాయత్నం



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి, జూలై 18: అరెస్టు నుంచి తప్పించుకోవడానికే అఖిల్ అనే యువకుడు భయభ్రాం తులను గురిచేయడం కోసం బ్లేడ్‌తో కోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఐ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది మందిపై నమోదైన గంజాయి కేసులో చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్ నిందితుడిగా ఉన్నాడు. వీరిలో అమీర్, కాల్వ వెంకటేష్, పండుగ అభి, రవిని విచారించగా వారందరికీ తోట అఖిల్ గంజాయిని సప్లయ్ చేసేవాడని తెలిసిందన్నారు. దీంతో అఖిల్‌ను చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన అనంతరం వేములవాడ రూరల్ పోలీసులకు అప్పగించగా వారు తీసుకుపోయే క్రమంలో అప్పటికే తన అన్న రాకేష్ ద్వారా ఒక పథకం ప్రకారం భయభ్రాంతులు గురిచేయాలనే ఉద్దేశంతో బ్లేడు తెప్పించుకొని, అఖిల్ తన శరీరంపైన గాయాలు చేసుకున్నాడన్నారు. ఈ క్రమంలో సిబ్బంది వెంటనే అడ్డుకొని, అతనిని ఆస్పత్రిలో చికిత్స చేయించారని తెలిపారు. అనంతరం అఖిల్‌ను వేములవాడ రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారన్నారు. ఈ సంఘటనలో కేవలం అరెస్టును తప్పించుకోవడానికి ఆడిన నాటకం అన్నారు. చట్ట ప్రకారం చేయవలసిన విధులలో పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అఖిల్ గంజాయికి, మద్యానికి బానిసై జల్సాలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ అరెస్ట్ చేసే సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కల్పించడంతో చందుర్తిలో కేసు నమోదు చేశామని వివరించారు.

విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, జూలై 18: విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. బట్టలు ఆరవేసే దండెము జిఐ వైర్లపై నుంచి విద్యుత్ వైర్లు వెళ్లడం వలన విద్యుత్ వైర్లలో ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడంతో దండెములకు విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్లాస్టిక్ దండెములను ఉపయో గించాలని కోరారు. విద్యుత్ సరఫరా వైర్లను ఎట్టి పరిస్థితుల్లో దండెంలకు, రేకులకు తగల కుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. భద్రత పట్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం, గృహాలలో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం వల్ల, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడటం వలన, రైతులు స్విచ్ బోర్డు/మోటార్ స్టార్టర్‌ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించక పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వినియోగదారులు అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

● ప్రమాదాల నివారణకు విద్యుత్‌శాఖ సూచనలు..

- రైతులు విద్యుత్ మోటార్లు, పైపులను, ఫుట్ వాల్వులను ఏమరుపాటుతో తాకకూడదు. వ్యవసాయ పంపుసెట్లను, స్టార్టర్లను విధిగా ఎర్తింగ్ చేయాలి. ఎర్త్ చేయని మోటార్లు, స్టార్టర్లు, పైపులు, ఫుట్ వాల్వులు తాకడం అత్యంత ప్రమాదకరం. రైతులు, వినియోగదారులు స్వయంగా సొంతంగా విద్యుత్ పనులు చేసుకోకుండా అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తో పనులు చేసుకోవాలి. పశువులను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకా లంలో స్తంభాలు తడిగా ఉండటం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- ఇంటి వైరింగ్‌కు సరైన ఎర్తింగ్ చేయాలి. నాణ్యమైన ప్లగ్గులు, సెల్‌ఫోన్ చార్జర్‌ను ఉపయోగించాలి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్‌ల ఆపరేట్, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- కరెంటు లైన్ల కింద పందిరిలు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలను అమర్చి చేపలను పట్టడం వలన షాక్ గురయ్యే అవకాశం ఉంది. ఇలా చేయడం చాలా ప్రమాదకరం. బోర్లు వేసేటపుడు, జెండా ఎగుర వేయునపుడు పైపులు వైర్లకు తాకకుండా జాగ్రత్త వహించాలి. సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడటం వలన షాక్‌కు గురై చనిపోతున్నారు. చార్జింగ్ వైరు తీసి ఫోన్ మాట్లాడాలి. పొలాలకు విద్యుత్ కంచెలు వేయరాదు.
- వర్షాలు కురిసినప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాల స్టేవైరు/సపోర్టు వైరును, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకరాదు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదు. ఇలాంటివి గమనించిన వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలుపాలి.
- విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని ముట్టుకోరాదు. అతడిని రక్షించడానికి విద్యుత్ ప్రవహించని (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వస్తువులను వాడాలి.

ఎక్సైజ్ సీఐకి ప్రశంసాపత్రం

- గంజాయి సాగు నియంత్రణలో కీలక పాత్ర


ప్రశంసా పత్రం అందుకుంటున్న సర్వేశ్వర్

జగిత్యాల టౌన్, జూలై 18: గంజాయి సాగు నియంత్రణలో ఎక్సైజ్ సీఐ కీలకంగా వ్యవహరించి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు.. జగిత్యాల డివిజన్‌లో ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న సర్వేశ్వర్ గతంలో ఖమ్మం డివిజన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా విధులు నిర్వహించాడు. గంజాయి సాగుతో పాటు వాటి ములాలను గుర్తించి 120 కేసుల్లో 4,630 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయిలోనే ఖమ్మం సీఐ గంజాయి నిర్మూలనలో మొదటి స్థానంలో నిలిచాడు. సీఐ సర్వేశ్వర్ ప్రతిభను గుర్తించిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలహాసన్ రెడ్డి ప్రశంసాపత్రాన్ని జారీ చేశారు. ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్‌ల చేతుల మీదుగా గురువారం ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన జగిత్యాల సీఐ సర్వేశ్వర్‌ను గురువారం జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణతో పాటు పలువురు అభినందించారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం


బాలు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 18: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని బొప్పాపూర్ గ్రామానికి చెందిన వేముల బాలు (35) అనే యువకుడు గురువారం రాత్రి అక్కడిక క్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బాలు ఇటీవల గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వెళతున్న క్రమంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దాంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని పోలీసులు వివరించారు. బాలుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధితకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

తంగళ్లపల్లి, జూలై 18: నేరాల నియంత్రణనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోందని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెర కాలనీ, దొమ్మరి వాడలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మట్లాడుతూ ప్రజల రక్షణ గురించి, సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ, గ్రామంలో, కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందన్నారు. నేరరహిత గ్రామాలుగా చేయలనే ఉద్దేశంతోనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలను, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని నియంత్రించేందుకు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. యువత మాధకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచతామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సరైన ధ్రువపత్రాలు లేని, నంబర్ ప్లేట్స్ లేని 15 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా వారి యొక్క వాహనాలకు ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగివుండాలని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో మరింత స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాల్లో, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ మొగిలి, ఎస్ఐలు సుధాకర్, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది, డిస్ట్రిక్ట్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



యువతకు కౌన్సెలింగ్ చేస్తున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

రక్తహీనతపై అవగాహన పెంచుకోవాలి

ఇల్లంతకుంట, జూలై 18: రక్తహీనత లక్షణాలపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని కోర్సు డైరెక్టర్ శ్రీనివాస్, రిసోర్స్‌పర్సన్ యాద రవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో గురువారం అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తహీనతతో పుట్టిన పిల్లలు జిల్లాలో ఎక్కువగా ఉన్నందున పైలెట్ ప్రాజెక్టు క్రింద జిల్లానే చేపట్టారని తెలిపారు. ఉపాధ్యాయులందరు రక్తహీనతపై ఆన్‌లైన్ కోర్సు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాలు ప్రేమలత, పావని, తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల పెంపునకు కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 18: గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సెర్ప్ అధికారులు, సిబ్బంది, ఆయా విద్యార్థి సంఘాల నాయకులతో గురువారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో దోస్త్ ద్వారా ఆన్‌లైన్ ప్రవేశాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఉపకార వేతనాలను మంజూరు చేస్తోందని అన్నారు. ప్రతి గ్రామంలోని తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన, మహిళ సంఘాల ప్రతినిధులు ఇంటర్ పూర్తయిన విద్యార్థులను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేలా చూడాలని శ్రీనివాస్ కోరారు. సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో-కన్వీనర్ రంజిత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బాలరాజు, నాయకులు సతీష్, సురేశ్, లక్ష్మణ్, సెర్ప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన బీజేపీ నాయకులు



హుస్సేన్ నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 18: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశానికి హాజరైన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌ను బీజేపీ నాయకులు గురువారం కలిసి సన్మానించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనం అనంతరం కలెక్టరేట్‌కు హాజరైన హుస్సేన్ నాయక్‌ను బీజేపీ రాష్ట్ర నాయకులు గరిపెల్లి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్‌కుమార్‌గౌడ్, కౌన్సిలర్లు బోల్గం నాగరాజుగౌడ్, గూడూరి భాస్కర్, కిరణ్‌నాయక్, కోడం ఆనంద్‌బాబు, కైలాస్, గుడ్ల విష్ణు, చిలుక సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు.

సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా: డీఎస్పీ

సిరిసిల్ల క్రైం, జూలై 18: సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా పెట్టామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం సిరిసిల్ల డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో వైరల్ కావడానికి చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వాహనాలపై ప్రమాదకర విన్యాసాలతో రీల్స్, వీడియోలు, ఫొటోల పేరుతో సోషల్ మీడియాలో వైరల్ చేస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది యువకులు వైరల్ కావడానికి వివిధ సందర్భాల్లో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగచేసేలా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ నిషేధిత ఆయుధాలు చేత పట్టుకొని సోషల్‌మీడియాలో పోస్టుచేసి చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో కొంత మంది యువకులు వైరల్ కావడానికి ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తూ పోస్టులు పెడుతున్నారని, ఇలాంటి వారిని ఉపేక్షించమని ఆయన తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారితో పాటు అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్రవాహనంపై తల్వార్, కత్తితో విన్యాసాలు చేస్తు సోషల్ మీడియాలో పోస్టుచేసిన సిరిసిల్లకు చెందిన తోటిచర్ల సాయివర్ధన్ అనే యువకుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

చండీ మహాయాగం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 18: సిరిసిల్ల పట్టణం పద్మశాలి సంఘం భవనంలో గురువారం చండీ మహాయాగం వాల్ పోస్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ కళాచక్రపాణి, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో భక్త మార్కండేయ ఆయలం నిర్మాణం త్వరగా పూర్తి కావాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఇబ్బందులు త్వరగా తొలగిపోవాలని, ప్రజలు అందరు ఆరోగ్యంతో పాటు సుఖ సంతోషలతో ఉండాలన్న సంకల్పంతో ఈ నెల 28 నుంచి అగస్టు 1వరకు చండీ యాగం నిర్వహిస్తున్నామన్నారు. మార్కండేయ ఆలయం ఆవరణలో చండీయాగం నిర్వాహణ కోసం కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సిరిసిల్ల పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయంలోని చండీయాగం ఏర్పాట్లను నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, టెక్స్‌టైల్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, సిరిసిల్ల పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మండల సత్యం, ఉపాధ్యక్షుడు మోర రవి, పట్టణ మహిళ విభాగం అధ్యక్షురాలు కాముని వనిత, యువజన సంఘం అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్, పద్మపురోహితులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 18: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. బడిలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి నిధులను పెంచి రుచికరమైన ఆహారం అందించాలని అన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అటెండర్, స్వీపర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సర్కారు అధిక నిధులు కేటాయించాలని కుమార్‌యాదవ్ అన్నారు. నాయకులు జితేందర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, బాలకిషన్, సురేశ్, నరేందర్, చరణ్, పవన్, చందు, మహేశ్ తదితరులు ఉన్నారు.

డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

ముస్తాబాద్, జూలై 18 : ముస్తాబాద్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మండల సామాజిక కార్యకర్త చింతోజు బాలయ్య పోస్టు కార్డు ఉద్యమాన్ని గురువారం చేపట్టారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టుకార్డులతో విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేశారు. 12 సంవత్సరాలుగా డిగ్రీ కళాశాల కోసం పోరాడుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. డిగ్రీ కళాశాల లేక పేదవిద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, కొంత మంది మధ్యలోనే చదువును ఆపేస్తున్నారని చింతోజు బాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ముస్తాబాద్ మండల విద్యార్థుల చిరకాల వాంఛను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పోస్టుకార్డు ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి వినతి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తకు కేకే పరామర్శ

గంభీరావుపేట, జూలై 18: మండల కేంద్రంలో వెన్నుముక నొప్పితో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తాహేర్‌ను గురువారం రాత్రి సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పరామర్శించారు. తాహేర్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరీ శంకర్, మాజీ సర్పంచ్ అక్కపల్లి బాలయ్య, యూత్ కన్వీనర్ శేఖర్, నాయకులు ప్రభాకర్, కుమార్, వెంకటి, యాదుల్లా ఉన్నారు.

రైతు కళ్లలో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ - జిల్లా వ్యాప్తంగా రైతు రుణమాఫీ సంబరాలు - పాల్గొన్న రైతులు, అధికారులు, నాయకులు







రైతు సంబరాల్లో భాగంగా ట్రాక్టర్ నడుపుతున్న ఆది శ్రీనివాస్, చంద్రంపేటలో మహిళా రైతుకు స్వీట్ తినిపిస్తున్న అదనపు కలెక్టర్, నాయకులు, నర్మాలలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, నాయకులు

కోనరావుపేట, జూలై 18: రైతు కళ్లలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్న సందర్భంగా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో రైతు రుణమాఫీ సంబరాల్లో ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సంబరాల్లో డోలు కొడుతూ నృత్యాలు చేస్తూ ట్రాక్టర్ నడుపుతూ రైతు వేదిక వద్దకు ర్యాలీగా వెళ్లి మాట్లాడారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ లక్ష రూపాయల లోపు రుణం తీసుకున్న రైతులకు సిరిసిల్ల జిల్లా పరిధిలో 23 వేల మంది, వేములవాడ నియోజకవర్గ పరిధిలో 11 వేల పైచిలుకు మంది రైతులకు మాఫీ చేయడం జరిగిందని అన్నారు. రైతులకు మళ్లీ రుణాలు తీసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి తుక్కుగూడ మహాసభలో సోనియా గాంధీ ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు రుణమాఫీ చేసి మాట నిలుపుకున్నామని అన్నారు. దీంతో రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామాకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, డీఏవో భాస్కర్, ఏవో వెంకట రామమ్మ, కాంగ్రెస్ జిల్లా నాయకులు జగన్మోహన్‌రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య చేపూరి గంగాధర్, నాలుక సత్యం, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, తాళ్లపెల్లి ప్రభాకర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● సిరిసిల్లలో బైక్ ర్యాలీ..

సిరిసిల్ల టౌన్: రుణమాఫీ శుభదినం రైతులకు పండుగ దినం అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టగా గురువారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్లను పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి హరీష్‌రావు ఆగస్టు 15న తరువాత రాజీనామాతో స్పీకర్ ఫార్మట్‌లో సిద్ధంగా ఉండాలని సూచించారు. సిరిసిల్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కేటీఆర్ బాగోతంతో పాటు ఆయన పీఏ తిరుపతి గొర్రెల దందాలో దోపిడీని కూడా త్వరలో బట్టబయలు చేస్తామన్నారు. అనంతం స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి చంద్రపేట రైతు వేదిక వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్మల స్వరూపతిరుపతి, పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: రైతులు పంటల సాగు కోసం తీసుకున్న పంట రుణాలను రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేయడంతో రైతుల్లో ఆనందం నెలకొందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట జిల్లా రైతు వేదికలో గురువారం సాయంత్రం జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి కేకే మహేందర్‌రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. అనంతరం రైతు రుణమాఫీని ప్రారంభించడంతో కాంగ్రెస్ నాయకులు టపాసులు కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మాజీ పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడుబాలరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులు మ్యాన ప్రసాద్, గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని ఇల్లంతకుంట, రేపాక, గాలిపెల్లి, పొత్తూర్, వల్లంపట్ల, పెద్దలింగాపూర్, దాచారం గ్రామాల్లోని రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సందేశాన్ని వీక్షించారు. అనంతరం రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బుద్దనాయుడు, తహసీల్దార్ జావెద్ అహమ్మద్, ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, నియోజకవర్గ యువన కాంగ్రెస్ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

● రాష్ట్రంలో రైతాంగ ప్రభుత్వం కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రమణారెడ్డిలు పేర్కొన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయడం పట్ల గురువారం పెద్దలింగాపూర్, అనంతగిరి, దాచారం, రేపాక గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, కొమ్ముల నర్సింగం, వెంకటరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఖాత మల్లేశం, సురేందర్‌రెడ్డి, లింగారెడ్డి, గాలిపెల్లి గోపాల్, అంతగిరి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విడుదల చేయడంపై అన్నదాతల మోముల్లో ఆనందం నెలకొంది. రుణమాఫీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు, రైతులు పూలమాలలు వేశారు. అక్కడ నుంచి మండలంలోని బొప్పాపూర్ రైతు వేదిక వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రత్యక్షంగా వీక్షించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, పట్టుపరిశ్రమల శాఖ అసిస్టెంట్ అధికారి జగన్, ఎంపీడీవో సత్తయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంతో పాటు నర్మాల రైతు వేదికలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ సంబరాలు జరుపుకున్నారు. రైతు రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తు తెలంగాణ స్తూపం వద్ద టాపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, జిల్లా కార్యదర్శి రామచంద్రం, నాయకులు పాల్గొన్నారు.

● రైతు రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయమని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు పక్షపాతిగా రైతుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. గంభీరావుపేటలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్‌తో కలిసి గురువారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. దేశానికి వెన్నుముక లాంటి రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచేందుకు అన్నదాతకు ఆర్థిక సాయం అందించడం లక్ష్యంగా రైతులకు రుణ విముక్తిని కల్గించిందన్నారు. రైతాంగానికి ఇచ్చిన మాటకు కట్టుబడి అాద్యాన్ని సుసాధ్యం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా రైతుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వీర్నపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయడం పట్ల మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి రైతులుపెద్ద ఎత్తున హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొంగు తిరుపతి అన్నారు. అనంతరం మండల కేంద్రంలో రైతులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భూంరెడ్డి, ఏఈవోలు ఫజల్, మసూద్, ఆయా గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: రైతు రుణమాఫీ చేసిన నేపథ్యంలో తాడూరు చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి బాణాసంచా కాల్చారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతును రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రూ 2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్మాని లింగారెడ్డి, భైరనేని రాము, పెద్దూరు తిరుపతి, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, గుగ్గిళ్ళ శ్రీకాంత్, జూపల్లి రాజేశ్వరరావు, మునిగల రాజు, మందాటి తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ అర్బన్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, రూరల్ మండల అధ్యక్షుడు వకులభారణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో రైతు వేదికలకు తరలి వెళ్లారు. అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఆధ్వర్యంలో మారుపాక గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన నిధల విడుదల కార్యక్రమానికి రైతులు బైక్‌ర్యాలీగా తరలివెళ్లారు. రూరల్ మండలంలో బైక్ ర్యాలీతో హనుమాజీపేట గ్రామంలోని రైతువేదికకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రైతులు సీఎం ఏర్పాటు చేసిన సమావేశాన్ని లైవ్‌లో వీక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అనుష్, రాజు, కాంగ్రెస్ నాయకులు రంగు వెంకటేష్, కత్తి కనుకయ్య, రైతులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, రైతులు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం రైతువేదికలో రుణమాఫీ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫిరెన్స్ రైతులు, నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీలత, మాజీ జడ్పీటిసి గట్ల మీనయ్య, మాజి సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామశాఖ అధ్యక్షులు సామ మోహన్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కెసిరెడ్డి నర్సరెడ్డి, గండి నారాయణ, కోమిరె శంకర్, చెలుకల తిరుపతి, మాడిశెట్టి అభిలాష్, ఇప్ప మహేష్, తర్రె లింగం, సిరికొండ రవి, ద్యావల రవి, స్వర్గం పరంధామ్, గంధం మనోజ్, పోగుల మహేష్, ఎర్రం రాజలింగం, ద్యావల దీలిప్, ఎర్రం అరవింద్, పడాల శ్రీనివాస్, తోకల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీని అమలు చేస్తున్న నేపథ్యంలో చందుర్తి మండల కేంద్రంలో రైతు వేదికలో రైతులతో కలిసి సంబరాల కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రుణమాఫీ లాంచనంగా ప్రారంభించి, రైతులతో లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడారు. చందుర్తి రైతు వేదిక ద్వారా చందుర్తి మండల నాయకులు, రైతులు వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కొమురయ్య, మండల తశీల్దార్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు, సింగిల్ విండో చైర్మెన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు నాగం కుమార్, పుల్కం మోహన్, అంచ రాంరెడ్డి, చింతపంటి రామస్వామి, పులి రేణుక సత్యం,ముస్కు ముకుంద రెడ్డి, భీమరాజు కనకరాజు, ధర్మపురి శ్రీనివాస్ వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

● రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం..

చందుర్తి: రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని మాజీ జడ్పీటిసి సభ్యుడు నాగం కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా చందుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నన్నారు. రైతు వేదిక నుండి మండల కేంద్రంలోని పలు వీధులలో కాంగ్రెస్ నాయకులు రైతులు ర్యాలీ నిర్వహించి, టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, నాయకులు భీమరాజు కనకరాజు, గొట్టె ప్రభాకర్, బాణాల రవీందర్ రెడ్డి, ముసుకు ముకుంద రెడ్డి, ,దర్మపురి శ్రీనివాస్, బోజ్జ మల్లేశం, వేల్పుల దేవ స్వామి, ముసుకు పద్మ మల్లారెడ్డి, బాణాల రవీందర్ రెడ్డి, ఎర్రం శ్రీమన్నారాయణ, పులి సత్తయ్యరవి, ప్రసాద్, ఏసుదాసు, బాలకృష్ణ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాబు, రమేష్,తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: లక్ష రైతు రుణాలను ప్రభుత్వ మాఫీ చేయడం పట్ల బోయినపల్లి మండలంలో రైతు వేదికల వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షులు కుస రవీందర్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, మాజీ ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, నాయకులు నాగుల వంశీ, బండి శీను, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని బందనకల్ గ్రామ రైతు వేదికలో రుణమాఫీ విడుదల కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఎం రేంవత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మొదటి విడుత రుణామాఫీ విడుదల కార్యక్రమాన్ని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు వేదికలో వీక్షించారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటేశ్, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ ప్రతినిధులు, సర్పంచ్‌లు గ్రామస్థులు పాల్గొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, పలువురు రైతులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



ఇల్లంతకుంటలో పాల్గొన్న అధికారులు, రైతులు



పెద్దలింగాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



బొప్పాపూర్‌లోని రైతు వేదిక వద్ద నాయకులు, రైతులు



గంభీరావుపేటలో సంబరాల్లో పాల్గొన్న నాయకులు, రైతులు



వీర్నపల్లిలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, నాయకులు



తంగళ్లపల్లిలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు







రుద్రంగిలో సంబరాలు జరుపుకుంటున్న రైతులు, చందుర్తిలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, బోయినపల్లిలో..